నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శనివారం 1 ఫిబ్రవరి 2025 | NALGONDA

నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సేవకు సత్కారం

తాజా మాజీ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు బీఆర్ఎస్ సన్మానం

అభినందించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి గుంటకండ్ల

రామగిరి, హాలియా, భువనగిరి అర్బన్, ఆలేరు టౌన్, నేరేడుచర్ల, జనవరి 31: మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు ఇటీవల ముగియగా.. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి ఇన్నాళ్లు సేవలు అందించిన తాజా మాజీ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అభినందించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం వారిని ఘనంగా సన్మానించారు. నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, నకిరేకల్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, ఆలేరు మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, హాలియా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, నేరేడుచర్ల మాజీ మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయరాజు, హుజూర్‌నగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్యతో పాటు నకిరేకల్ మాజీ ఎంపీటీసీ గుర్రం గణేశ్, బీఆర్ఎస్ నేరేడుచర్ల, పాలకవీడు మండలాధ్యక్షులు అరిబండి సురేష్‌బాబు, కిష్టపాటి అంజిరెడ్డి , డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులును అభినందిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

నేరేడుచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ జయరాజును సన్మానిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆలేరు మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య దంపతులను సత్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీతామహేందర్‌రెడ్డి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేతుల మీదుగా సన్మానం పొందుతున్న నకిరేకల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్

హుజూర్‌నగర్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నుంచి సన్మానం పొందుతున్న హాలియా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్

3 నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్

- మూడు విడుతల్లో పరీక్షలు
- నల్లగొండ జిల్లాలో 16,866 మంది సైన్స్ , ఒకేషనల్ విద్యార్థులు

రామగిరి, జనవరి 31 : ఇంటర్మీడియట్ సైన్స్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు జరుగనున్నాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం రెండింటి నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు మూడు విడతల్లో పూర్తి చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా 135 ప్రభుత్వ, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ప్రైవేట్, గురుకుల జూనియర్ కళాశాలలు ఉండగా,.. సైన్స్, ఒకేషనల్ విభాగాల్లో ఉన్న 16, 866 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. దాదాపుగా అన్ని కాలేజీల్లో సెంటర్లు ఏర్పాటు చేశారు. డీఈసీ, హెచ్‌పీసీ బృందాలతోపాటు ఫ్లైయింగ్ స్కాడ్ బృందాలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించనున్నాయి. ల్యాబ్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ కళాశాలలకు నిర్వహణకు ఇప్పటికే నిధులు కేటాయించారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఐఈఓ దస్రూ తెలిపారు. సీసీ కెమోరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

సాంకేతిక కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, జనవరి 31 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా అందించే సాంకేతిక శిక్షణ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి తెలిపారు. మూడున్నర నెలల కాలపరిమితితో కూడిన అకౌంట్స్ అసిస్టెంట్ ట్యాలీ (బీకామ్ పాస్), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ (ఇంటర్మీడియట్ పాస్), ఆటోమొబైల్ టూ వీలర్ సర్వీసింగ్, సెల్ ఫోన్ మరియు ఎలక్ట్రానిక్స్ రిపేర్ (పదో తరగతి పాస్), ఎలక్రీషియన్ (డొమెస్టిక్),సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ సర్వీస్ (పదో తరగతి) కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డ్, రేషన్ కార్డుతో ఫిబ్రవరి రెండున కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. ఉచిత శిక్షణతోపాటు హాస్టల్, భోజన వసతి, శిక్షణ అనంతరం ఉద్యోగాశకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు 91339 08000, 91339 08111, 913390 8222, 99484 66111ను సంప్రదించాలని శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

మోతె, జనవరి 31: కాంగ్రెస్ మోసాలను ప్రజల్లో ఎండగట్టాలని బీఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ మోతె మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రైతాంగానికి కాళేశ్వరం జలాలు ఇచ్చేది లేదు కానీ లిఫ్ట్‌ల పేరుతో కమీషన్ల కోసం కొత్త డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. స్వార్థ రాజకీయాల కోసం పార్టీ నుంచి వెళ్లిన వారితో నష్టమేమీ లేదని, వారు కూడా తమ తప్పును గుర్తించే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. పార్టీ శ్రేణులు అధైర్య పడొద్దని, పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పార్టీ మారాలని కాంగ్రెస్ చేస్తున్న బలవంతపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలోనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటివరకు రైతుభరోసా ఇవ్వలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోజుకో రైతు చొప్పున 412 మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో గురుకులాల్లో 55 మందికి పైగా విద్యార్థులు మృతిచెందారని, ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శీలం సైదులు, మాజీ ఎంపీపీ ఆరె లింగారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఏలూరి వెంకటేశ్వరరావు, మండల నాయకులు మద్ది మధుసూదన్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, కొండ వెంకన్న, పల్స మల్సూర్, యూత్ అధ్యక్షుడు జానీపాషా, మహిళా అధ్యక్షురాలు శోభారాణి, నాయకులు నూకల శ్రీనివాస్‌రెడ్డి, దేవల నాయక్, మైనంపాటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లపల్లి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశలు.. అడియాశలు

తీవ్ర అసంతృప్తిలో కాంగ్రెస్ నేతలు

- బీఆర్ఎస్‌లోకి పెరుగుతున్న చేరికలు
- ఏడాది పాలనపై కాంగ్రెస్ శ్రేణుల పెదవివిరుపు
- అధికారం కోసం కష్టపడితే గుర్తింపు లేదని మండిపాటు
- ప్రజల్లో అంతకంతకూ పెరుగుతున్న వ్యతిరేకత
- భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని సర్వత్రా చర్చ

ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ వైపు చూపులు



సూర్యాపేటలో ఇటీవల మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నూతనకల్ మండలం వెంకేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మారోజు ఏకాంబరచారి (ఫైల్)

రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కారుపై ప్రజలతోపాటు సొంత పార్టీ శ్రేణుల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొంటున్నది. ఏడాది పాలనలోనే అన్ని రంగాల్లో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విపక్షాలు దుమ్మెత్తి పోస్తుండగా.. ఇక ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సైతం అదే దారిలో పయనిస్తున్నారు. కేసీఆర్ సర్కారు కంటే గొప్పగా చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్తే నమ్మి అధికారం కోసం కష్టపడితే ఇప్పుడు జరుగుతున్నది అందుకు పూర్తి భిన్నంగా ఉందని కాంగ్రెస్ శ్రేణులు అంతర్మథనంలో పడ్డాయి. కొత్త హామీల అమలు అటుంచితే.. కేసీఆర్ సర్కారులోని పథకాలను సైతం సరిగ్గా అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన గ్రామసభల్లో మెజార్టీ గ్రామాల్లో ప్రభుత్వాన్ని నిలదీయడమే అందుకు నిదర్శనం. ఏడాది నుంచి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వక, రుణ మాఫీ పూర్తి చేయక, రైతుబంధు ఇవ్వక, పెన్షన్లు పెంచక ఇలా ఏ హామీని కూడా పూర్తి చేయకపోవడంతో ప్రజల్లో కాంగ్రెస్ నేతలు తలెత్తుకోలేక పోతున్నారు. దాంతో ఆ పార్టీ నేతలు ఇక లాభం లేదన్నట్లుగా రాజకీయంగా ప్రత్యామ్నాయం చూసుకునే పనిలో పడ్డట్లు చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీని వీడుతున్న నేతల సంఖ్య పెరుగుతున్నది. తిరిగి రాష్ట్రంలో బీఆర్ఎస్‌దే ప్రత్యామ్నాయం అనే విశ్వాసంతో కేసీఆర్ నాయకత్వం వైపు మొగ్గు చూపుతుండడం ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

– నల్లగొండ ప్రతినిధి, జనవరి 31 (నమస్తే తెలంగాణ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇటీవల కాలంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు పెరుగుతుండడం రాజకీయంగా చర్చనీయాంశం అవుతున్నది. తాత్కాలికంగా అధికారంలో లేకపోయినా సరే భవిష్యత్ బీఆర్ఎస్‌దేనన్న విశ్వాసం కనపడుతుండడం గమనార్హం. అందుకే బీఆర్ఎస్‌లోకి క్రమక్రమంగా చేరికలు ఊపందుకుంటున్నట్లు తెలుస్తున్నది.. జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో రానున్న కాలంలో ఈ చేరికలు మరింత ఉపందుకోవచ్చని ఇటీవలి పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా గురువారం నల్లగొండ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ మాడ్గులపల్లి మండలం దాచారం గ్రామ అధ్యక్షుడు దాసోజు రామాచారి, మరో నేత లేళ్ల సందీప్‌రెడ్డి సారథ్యంలో ఆ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఇంటికి తరలివచ్చారు. కాంగ్రెస్ పార్టీనీ వీడి భూపాల్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకొన్నారు. ఎన్నో ఆశలతో మార్పు కోరి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుంటే ప్రజలను గాలికి వదిలేశారని, ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందంని పార్టీలో చేరిన నేతలు వ్యాఖ్యానించారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని కూడా వీరు స్పష్టంగా చెప్పారు. నకిరేకల్ నియోజకవర్గం కట్టంగూరులో యువజన కాంగ్రెస్ నేత పెద్ది మహేశ్‌గౌడ్ తన అనుచరులతో కలిసి గత అక్టోబర్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దేవరకొండ నియోజకవర్గంలోని పీఏపల్లి మండలం మాజీ వైస్ ఎంపీపీ అవరపల్లి సరిత, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎర్ర యాదగిరి తమ అనుచరులతో కలిసి గత డిసెంబర్ 8న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. చందంపేట మండలం గాగిళ్లాపురంలో మాజీ వార్డు సభ్యుడు బిజీలి సుధాకర్‌తోపాటు మరికొంత మంది కాంగ్రెస్ నుంచి తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు.

తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని శాలిగౌరారం మాజీ ఉపసర్పంచ్ గోదల సురేశ్‌రెడ్డి, సురేశ్, చీమల శంకర్ బీజేపీ నుంచి, ఈర్ల శివ, రాజు, ముత్యాలు, సతీశ్ మరికొందరు కాంగ్రెస్ పార్టీ నుంచి తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ పాలననే రాష్ట్రానికి ప్రత్యామ్నాయమని భావిస్తూ మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో మాజీ ఉపసర్పంచ్‌తోపాటు మిగతావాళ్లు బీఆర్ఎస్ కండువా కప్పుకొన్నారు. సూర్యాపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సమక్షంలోనూ పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. నూతనకల్ మండలం వెంకేపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మారోజు ఏకాంబరాచారి గులాబీ కండువా కప్పుకొన్నారు. భువనగిరి నియోజకవర్గం పరిధిలోని బీబీనగర్‌లో కాంగ్రెస్, బీజేపీ నుంచి ఈ నెల 25న బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు జరిగాయి. జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మల్లగారిశ్రీనివాస్‌తోపాటు బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల అశోక్‌తోపాటు వారి అనుచరులు మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. వీరినీ శేఖర్‌రెడ్డితోపాటు మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఆహ్వానించారు. ఇలా కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్ వైపు మొగ్గు చూస్తున్న వాళ్ల సంఖ్య పెద్దసంఖ్యలో ఉన్నట్లు తెలుస్తున్నది. గురువారం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా నిర్వహించిన పోల్‌లో సైతం 70శాతం మంది కేసీఆర్ పాలనకే జై కొట్టడం కూడా ప్రాధాన్యం సంతరించుకున్నది. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న కాలంలో ప్రజల్లో మరింత అసంతృప్తి పెరుగుతుందని ఆ పార్టీ శ్రేణులు భయపడుతున్నాయి. ఈ పరిణామాలన్నీ కాంగ్రెస్ నేతలను డైలమాలో పడేస్తున్నాయి. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల నాటికి చేరికలు మరింత ఉపందుకోవచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

పెద్దగట్టుకు పైసా ఇయ్యలే

లింగమంతుల జాతరపై సర్కారు నిర్లక్ష్యం

- రెండు వారాల్లో జాతర.. రేపే దిష్టిపూజ
- లక్షలాదిగా పోటెత్తనున్న భక్తులు
- బీఆర్ఎస్ హయాంలో 5 జాతరలకు రూ.15 కోట్లకు పైనే

సూర్యాపేట, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రెండో అతి పెద్ద జాతర.. రెండేండ్లకోసారి జరిగే దురాజ్‌పల్లి లింగమంతుల జాతరపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు. నిండా రెండు వారాల గడువే ఉండగా.. అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు ఇప్పటికీ నయాపైసా విదిల్చలేదు. 2014కు పూర్వం గత ఉమ్మడి రాష్ట్రంలో జాతరకు అప్పటి సమైక్య పాలకులు రూ.50వేలకు మించి నిధులు ఇచ్చిన దాఖలాలు లేవు. స్వరాష్ట్ర సాధన అనంతరం సూర్యాపేట ఎమ్మెల్యేగా జగదీశ్‌రెడ్డి వరుస విజయాలతో పెద్దగట్టుకు కొత్త వైభవం చేకూరింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఐదు జాతరలకు దాదాపు రూ.15 కోట్లకు పైనే ఖర్చు చేయడంతో పెద్దగట్టు రూపురేఖలు మారాయి. రాష్ట్ర నలుమూలలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు లక్షల్లో పోటెత్తినా ఎక్కడా అసౌకర్యం అనే మాట వినిపించ లేదు. కాగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వసతుల కల్పనపై కనీస శ్రద్ధ పెట్టడం లేదు. ఫిబ్రవరి 16 నుంచి జాతర ప్రారంభం కాకుండా ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంపై యాదవులతోపాటు అన్ని వర్గాల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెద్దగట్టు జాతరపై మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలోని నిర్లక్ష్యపు నీడలు అలుముకుంటున్నాయని ఆందోళన చెందుతున్నారు.

బీఆర్ఎస్ హయాంలో సర్వాంగ సుందరంగా మారిన లింగమంతుల గుడి

పెద్దగట్టు లింగమంతుల జాతర బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నంత కాలం వైభవంగా వెలిగింది. ఉమ్మడి రాష్ట్రంలో పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తులు అసౌకర్యాల నడుమ నానా అవస్థలు పడి లింగన్న దర్శనం చేసుకొని వెళ్లేవారు. నాటి ప్రభుత్వాలు జాతరను కనీసం గుర్తించకపోవడం, స్థానిక పాలకులు పట్టించుకోకపోవడంతో నిధులు రావడం మహాగగనంగా ఉండేది. వచ్చిన నిధులతోనూ తాత్కాలిక పనులు చేపట్టి మెజారిటీ స్వాహా చేసేవారు. ఉమ్మడి రాష్ట్రంలో అనాదిగా జరిగిన జాతరలన్నింటికీ కలిపి కూడా 2014 తరువాత జరిగిన ఒక్క జాతరకు బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసినన్ని నిధులు ఇవ్వలేదని పలువురు యాదవ పెద్దలు చెబుతున్నారు. కేసీఆర్ సర్కారులో మాత్రం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి చొరవతో కోట్ల రూపాయలు ఖర్చు చేసి అనేక శాశ్వత సౌకర్యాలు కల్పించారు.

ఉమ్మడి రాష్ట్రంలో పెద్దగట్టు లింగన్న ఆలయం(ఫైల్)

ఇద్దరు మంత్రులున్నా..

ఫిబ్రవరి రెండున పెద్దగట్టు స్వామి జాతరకు సంబంధించి దిష్టిపూజ మహోత్సవం నిర్వహించనున్నారు. 16 నుంచి 20 వరకు ఐదు రోజుల పాటు జాతర సాగనుంది. నిండా రెండు వారాలే గడువు ఉండగా, నిధుల లేమికారణంగా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. గత బీఆర్ఎస్ హయాంలో ప్రతి జాతరకు మూడు నెలల ముందు నుంచే అభివృద్ధి, మౌలిక వసతుల పనులు ప్రారంభమయ్యేవి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు, మరో ఇన్‌చార్జి మంత్రి ఉండగా.. కనీసం బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులను మెయింటెనెన్స్ కోసమైనా నిధులు ఇచ్చేనా అని పలువురు యాదవ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదేండ్లు... 15 కోట్లు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐదు సార్లు జాతర రాగా.. ప్రతి జాతరకూ కోట్లాది రూపాయలు విడుదలయ్యాయి. 2015 ఫిబ్రవరిలో మొదటి జాతర రాగా, ఘనంగా జరిపేందుకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి సీఎం స్పెషల్ డెవల్‌మెంట్ ఫండ్ నుంచి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి రూ.2.10కోట్లు తీసుకువచ్చారు. 2017 జాతరకు రూ.1.29 కోట్లు, 2019లో రూ.1.75కోట్లు, 2021లో రూ.2కోట్లు, 2023లో జరిగిన జాతరకు రూ.5కోట్లు మంజూరు చేయించారు. మొత్తం ఐదు జాతరలకు కలిపి ప్రభుత్వం రూ.12.14 కోట్లు ఇవ్వగా, కానుకలు, వేలం పాటల ద్వారా మరో రూ.3కోట్ల వరకు వచ్చాయి. ఆ నిధులతో లింగమంతుల జాతరకు ఉమ్మడి రాష్ట్రంలో ఏనాడూ లేనివిధంగా శాశ్వత సౌకర్యాలు కల్పించారు. పాత గుడి స్థానంలో నూతన నిర్మాణం చేపట్టారు. గుట్టపై వరకు ప్రత్యేకంగా మిషన్ భగీరథ పైపులు వేసి లక్ష లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకును నిర్మించారు. శాశ్వత కల్యాణ కట్ట, ఈఓ కార్యాలయం, భారీ గెస్ట్ హౌస్ కట్టారు. భక్తుల సౌకర్యం కోసం గుట్ట చుట్టూ నీటి సంపులు, నల్లాలు ఏర్పాటు చేసి మిషన్ భగీరథ నీటిని అందించారు. ప్రత్యేకంగా సబ్‌స్టేషన్, శాశ్వత విద్యుత్ లైన్లు, గుట్ట వద్దకు వెళ్లేందుకు ఉన్న రెండు రహదారులను సీసీలుగా మార్చడం జరిగింది. అన్నింటికీ మించి గుట్టకు అనుకుని ఉన్న పాత కోనేరును అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.

రీజనింగ్ నాగేశ్వర్ రావు | తెలంగాణ ఉద్యమం చరిత్ర రింగాస్టెమి సార్
జాగ్రఫీ జానయ్య సార్ | హిస్టరీ శేఖర్
పాలిటీ ముత్యాలు | బయోసైన్స్ సీతారాంరెడ్డి
GK & CA నందగోపాల్ | ఎకానమీ గంగరాజు
అర్థమెటిక్ భగత్ సార్ | ఫ్యాకల్టీ టీం ఆధ్వర్యంలో
SI-PC | RRB Group-D | FBO VRO
Group - II, III, IV, అడ్మిషన్లు జరుగుచున్నవి
బ్యాచ్ ప్రారంభమైనది: ఉదయం: 10 గం.లకు
SLICE2 కోచింగ్ సెంటర్
LPT మార్కెట్ Hyd. రోడ్, నల్లగొండ, తిరుమల టాకీస్ ప్రక్కన
7989568604, 9676688651